# శిధిల రక్తం

--సింహప్రసాద్



ఊర్నించి అప్పుడే వచ్చాడు వెంకట్రావు.

ఇంట్లో కెళ్ళబోతూ ఆగిపోయాడు.

తన కళ్ళు మోసం చేస్తున్నాయేమోనని కళ్ళు నలుపుకుని మరీ చూసాడు.

నేను సత్యం అని చెబుతూ ఎదురుగా నిలబడి వుంది గోడ.

రెండ్రోజులక్రితం వరకూ అక్కడేమీ లేదు. అది తనింటికీ తమ్ముడింటికీ మధ్యనున్న కాలిదారి. వుమ్మడిదారి. తమ్ముడికి వేరే దారికూడా వుందిగాని తమకి లేదు. తనింటి పెరట్లో కెళ్ళాలంటే అదొక్కటే మార్గం.

ఆ దారి మూసేస్తూ అడ్డంగా లేచింది ఆరడుగుల గోడ!

వుమ్మడి దారిని తమ్ముడి వాటాలో కలిపేస్తూ లేచిందది. ఇంట్లోంచి తప్ప మరో రకంగా పెరట్లో కెళ్ళే మార్గం లేకుండా చేస్తోందది.

ఎంత అన్యాయం!

తమ్ముడింత దారుణానికి తలపడతాడా?

వెంకట్రావులో పౌరుషం బుసలు కొట్టింది. తొడకొట్టమని ప్రోత్సహించింది.

అతడి రౌద్రాకారం చూసి లబలబలాడింది కామమ్మ.

"అన్నిటికీ తెగించినోడితో తలపడితే మనకే నష్టమండీ. వాడసలే రౌడీ ముండాకొడుకు. అన్నగారి స్థలం అని కూడా లేకుండా ఆక్రమించేసుకున్నాడు....."

"అందుకేనే వాడికి తగిన గుణపాఠం చెబుతాను. నువ్వడ్డులే"

"మీరెళ్తే నేను చచ్చినంతొట్టు. వూరు గొడ్డు పోలేదండీ. పెద్ద మనుషుల్లో పెడితే నాలుగు చివాట్లేసి గోడపడగొట్టించేస్తారు. గోటితో పోయేదానికి గొడ్డలొద్దండీ" కాళ్ళావేళ్ళా పడింది.

చేతిలోని కర్రని విసిరేశాడు.

అతడి ఆవేశం సద్దుమణిగింది.

భార్య మాటకూడా యదార్థమే అన్పించింది. చిన్న విషయానికి వీధెక్కి గొడవపడటం అనవసరం. తనక్కావల్సింది పరిష్కారం గాని గొడవకాదు. పైగా తను పెద్దవాడు. విజ్ఞత ప్రదర్శించాల్సినవాడు. లేకపోతే వూళ్ళోనిజనం "పెద్దోడివైనా బుద్దుండొద్దా" అని తననే నిందిస్తారు.

"నీకు నాతో పనిబడిందా - ఏంటోయ్ అదీ"

"మా తమ్ముడేం చేశాడో చూశారా?"

"ఏం చేశాడబ్బా?" ఏమీ ఎరగనివాళ్ళా అడిగాడు సర్పంచ్. ప్రక్కనున్నవాళ్ళు ఆయన ధోరణికి విస్తుబోయారు. ఆ గోడ గురించి మాట్లాడుకుని కొన్ని నిమిషాలు కూడా కాలేదు మరి!

"మా వుమ్మడి స్థలంలో గోడకట్టేశాడు"

"ఎట్టెట్టా. వుండు నీ తమ్ముడ్ని పిలిపిస్తాను. నీతోమాట వరసకైనా చెప్పకుండా ఇంతకు తెగిస్తాడా"

అక్కడున్న ఒకర్ని తరిమారు.

అతడెళ్ళి చంద్రరావుని తీసుకొచ్చాడు.

"ఏంటోయ్. ఇదేమైనా బాగుందా. మీ అన్నయ్యకి చెప్పకుండా వుమ్మడి భూమిలో గోడకట్టేశావుట' '

"ముందు చెప్పకపోవడం తప్పేనండి. ఇంట్లో సిమ్మెంటు పని చేయిస్తూ పన్లోపనిగా గోడకట్టించేశానండి"



**మనుషులూ మనసులే కాదు రక్తం కూడా శిథిలమై పోయింది. అంతా పాడుబడిపోయింది. బీడై పోయింది. వల్లకాడై పోయింది. నిన్న అయోధ్యలో ఇవాళ ఇక్కడ రేపు .....!**

అంత పనీ చేసేవాడే కూడా. కానింతలో అతడి భార్య గబగబా వచ్చి చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకుపోయింది.

"మీరంతా ఎలా వూరుకున్నారే?" గర్జించాడు.

"ఏం చెయ్యమంటారు. నెత్తీ నోరూ కొట్టుకున్నాం. మీ తమ్ముడు వింటేనా! ఇరుగూ పొరుగూ వచ్చి చిలక్కి చెప్పినట్టు చెప్పేరు. వాళ్ళ మీద తాడెత్తు లేచాడు!"

"అంత మొనగాడయ్యాడన్నమాట. వాడంతు చూస్తానుండు..." మూలనున్న చేతికర్ర అదుకున్నాడు.

అంచేత విషయం గ్రామపెద్దల ముందు పెట్టడమే మంచిదన్న నిర్ణయానికొచ్చాడు.

గొంతులో ఇన్ని నీళ్ళు పోసుకుని తిన్నగా సర్పంచ్ ఇంటికెళ్ళాడు వెంకట్రావు.

వాలుకుర్చీలో కూర్చుని గ్రామస్తులతో ఢిల్లీ రాజకీయాలగురించి మాట్లాడుతున్నాడు సర్పంచ్. వెంకట్రావుని చూసి ఇబ్బందిగా కదిలాడు.

"ఏవోయ్ - దారి తప్పివచ్చినట్టున్నావ్"

"తవఁర్తో పనుండొచ్చానండి"


"అది నీ అబ్బ స్థలం అనుకున్నావుట్రా నీ ఇష్టమొచ్చినట్టు చేయించడానికి" వెంకట్రావు ఒంటి కాలిమీద లేచాడు.

"నా అబ్బ స్థలం గనుకే కట్టేన్రా" కోడి పుంజులా ఎగిరాడు చంద్రరావు.

"మధ్యన పెద్దమనిషిని పెట్టుకుని మీరు తన్నుకు ఛస్తారేంటి- తగ్గండి" కేకలేశారు సర్పంచ్.

ఇద్దరూ ఆవేశాల్ని అదుపులో పెట్టుకున్నాక అన్నారు "ఆ గోడ వల్ల ఎవరికి లాభం ఎవరికి నష్టం?"

"న్యాయాన్యాయాల గురిం?




డక లాభ నష్టాల గురించడుగుతారేంటండీ" వెంకట్రావడిగాడు కాస్త గట్టిగానే.

"ఆ సంగతి నాకు తెల్సుగాని అడిగిం దానికి సమాధానం చెప్పవోయ్"

"మాకే నష్టమండీ. పాలేర్లూ కూలీలూ పెరటివేపుకి రావాడానికి దారి లేకుండా పోయింది. కులంకాని కులంవాళ్ళు కూడా ఇహ ఇంట్లోంచే నడవాలి. ఇదెలా కుదురుద్ది? ఆ గోడని పడగొట్టించాల్సిందే. ఆ దారి మూసే హక్కు అధికారమూ ఎవడికీ లేవు"

"నువ్వేమంటావురా" చంద్రరావుని అడిగారు.

"మా ఆడంగులు మసల్డానికి చాలా ఇబ్బందిగా వుంటోందండి. అందుకనే గోడ కట్టించానుగాని వీడి మాన్యాలు కలిపేసుకోవాలనికాదు. వీడి పాలేర్లూ వాళ్ళూ మసల్డానికి కొంచెం ఇవతలగా మా గుమ్మం వుందండి. అందులోంచి మా అన్నయ్యింటి పెరట్లోకివెళ్ళొచ్చు రావొచ్చండి."

"నీ దయా దాక్షిణ్యాలు నాకేం అక్కర్లేదు. గోడకట్టి వుమ్మడి స్థలం కాజేద్దామని ఎత్తు వేశావు. నీ ఎత్తులు నా దగ్గర సాగవు. ఆ గోడ పడగొట్టాల్సిందే."

"ఆ గోడ పడగొడ్తే పుచ్చెలెగిరిపోతాయి"

"ఎవరి పుచ్చె లెగుర్తాయో చూద్దాం రారా"

కస్సుమని లేచారు సర్పంచ్. "అంతగా కొట్టుకోవాలనుకున్న వాళ్ళు అక్కడే కొట్టుకు చావకపోయారా. ఇంత దూరం ఎందుకొచ్చారా? నా మీద గౌరవం వుంటే నేన్చెప్పేది వినండి. లేకపోతే పోండి"

ఇద్దరూ తలలొంచుకున్నారు.


సర్పంచ్ మీసం సవరించుకుని మెల్లగా అన్నారు "చూడొరే వెంకట్రావూ. మీరిద్దరూ అన్నదమ్ములుగాని శత్రువులు కాదు. తెలిసో తెలీకో చిన్నవాడు తొందరపడ్డాడు. పెద్దవాడివి నువ్వు సమర్థించుకు పోవాలి తప్పు కయ్యానికి దిగితే ఎలా చెప్పు? అక్రమంగా ఆక్రమించేశాడనుకోడానికి ఎకరాల భూమేమీ కాదుకదా కేవలం ఆరడుగులనేల. అదైనా వుమ్మడి రహదారి. అతడికేదో ఇబ్బందిగా వుందని కట్టానంటున్నాడు గనుక పోనీలే అని వూరుకుంటే ఆ మంచితనమేదో నీకే దక్కుద్ది. నీ పాలేర్లూ వాళ్ళు తనవైపునుంచి మసల్డానికి అభ్యంతరం లేదంటున్నాడు గనుక ఆ గోడవల్ల నీకేమీ ఇబ్బందుండదు. మరంచేత నువ్వు పెద్దమనస్సు చేసుకుని చంద్రరావుని క్షమించెయ్యి."

అవాక్కయ్యాడు వెంకట్రావు.

జరిగిన అన్యాయానికి తలొంచెయ్యమని ఆయన తీర్పునిస్తాడని కలలో కూడా అనుకోలేదు. అలాగని దాన్ని శిరసావహించడానికి మనస్సంగీకరించనూలేదు.

ఎటూ చెప్పక విసవిసా వెళ్ళిపోయాడు వెంకట్రావు.

"రెండ్రోజులు కాస్త జాగ్రత్తగా వుండరేయ్ చంద్రరావ్" సర్పంచ్ అన్నారు.




"ఏదో తమరున్నారన్న ధైర్యంతో గోడ కట్టేశాను. ఏ మొచ్చినా అన్నీ మీరే చూసుకోవాలి. వస్తానండి' ' శలవు తీసుకున్నాడు చంద్రరావు.

అక్కడే వున్న వూరివాళ్ళు అయోమయంగా చూస్తూండిపోయారు. అంతా గందరగోళంగా వుంది వారికి!

అది గమనించి అన్నారు సర్పంచ్- "అంతా పోయే వాళ్ళమే. అంతా ఈ మట్టిలో కలిసే వాళ్ళమే. ఈ భూములూ ఈ గోడలూ చచ్చేక మన కూడా వస్తాయా వీళ్ళ పిచ్చిగానీ!"

రోజులు దొర్లుతున్నాయి.

గోడ విషయం పుండులా సలుపుతూనే వుంది వెంకట్రావుని మధ్య మధ్య సెలవేస్తూనే వుంది.

ఎందుకొచ్చిన గొడవలని భార్యా బంధువులూ చెబుతున్నాసరే సరిపెట్టుకోలేక పోతున్నాడతడు. ఆ గోడని చూసినప్పుడల్లా వుద్రేకపడుతూనే వున్నాడు. తన శరీర భాగాన్నెవరో అన్యాయంగా ఖండించి తీసేసుకున్నట్టుగా వుంది. తన పౌరుష హీనతకి పిరికి తనానికి చిహ్నంగా అనిపిస్తోంది.

ఇంతలో అనుకోకుండా ఓ సంఘటన జరిగింది. అగ్నికి ఆజ్యం పోసింది.

వెంకట్రావు పాలేరు పోలాన్నుంచి కొబ్బరికాయల మూటతో వచ్చాడు. పెరట్లోకి తెచ్చి కాయల్ని ఒలవమంది కామమ్మ.

తలుపు తట్టేడుకాని చంద్రరావు ఇంటి వాళ్ళు తలుపు తీయలేదు. తలమీద బరువు వుండటంతో కొంచెం గట్టిగా పిలిచాడు పాలేరు.

"అడ్డమైన వాళ్ళకీ తలుపు తియ్యంపో" అంది చంద్రరావు భార్య కోపంగా.

"నన్ను అడ్డమైన వాడంటారా. మా కులపోళ్ళని తీసుకొత్తాను. మీరెలాటోళ్ళో వూరంతా చాటింపేత్తాము" అంటూ చిందులేశాడు.

అది విని చంద్రరావు దూసుకొచ్చి అతడి మీద చేయిచేసుకున్నాడు. సరిగ్గా అప్పుడే బండి తోలుకొస్తోన్న వెంకట్రావు దృష్టిలో పడిందా దృశ్యం. బండి మీంచి దూకి పరుగునొచ్చి కవుసీ కర్రతో తమ్ముణ్ని కొట్టాడు. ఇద్దరూ కలబడ్డారు.

నలుగురూ వచ్చి విడదీశారు. శాంత పర్చేరు.

అవాళ్టి నుంచీ చంద్రరావూ వాళ్ళు వీళ్ళకి దారివ్వటం పూర్తిగా మానేశారు. పాలేర్లూ పనివాళ్ళూ అంతా వీధి గుమ్మం లోంచే పెరట్లోకెళ్ళాల్సొస్తోంది.

తలకొట్టేసినట్టుగా వుంటోంది. వెంకట్రావుకి. వూపిరి బిగదీసి కట్టినట్టుగా వుందతడి పరిస్థితి.

"అతడు తమ్ముడు కాదు పగవాడు. ఏలిన నాటి శని. ఈ రకంగా పట్టి పీడిస్తున్నాడు" కామమ్మ గొణుగుతోంది.

సర్పంచ్ దగ్గర దగువు పెట్టాలన్పించింది. కాని ఆయన న్యాయం చేస్తాడన్పించక వుగ్గబెట్టి వూరుకున్నాడు. తనేమాత్రం తొందరపడ్డా రక్తం పారొచ్చుని సందేహిస్తూండి పోయాడు.

ఒకరోజున మాజీ సర్పంచ్ భూషయ్య కబురెట్టారు. ఎందుకో అనుకుంటూ వెళ్ళాడు వెంకట్రావు.

"నువ్వేదో మగాడివనుకున్నాను. ఇలా

గాజులు తొడిగించుకుని కూర్చుంటావనుకో లేదు వెంకట్రావూ" అన్నాడాయన.

ఆ మాటలు బాణాల్లా సూటిగా గుండెలకి తగిలాయ్. పౌరుషంగా చూశాడు.

"నీకంటే చిన్నవాడు నీ స్థలాన్ని ఆక్రమించి గోడకడితే వూరుకున్నావు. దారివ్వనంటే సహిస్తున్నావు. నీకు రోషంలేదో తెలివిలేదో లేక రెండూ లేవో తెలీటం లేదు"

"మరేమో సర్పంచ్‌గారు....."

"వాడి వూసెత్తకు నా దగ్గిర. వాడొట్టి దగుల్బాజీ వెధవ. పంచాయితీ సొమ్ము అడ్డంగామేసేస్తున్న గాడిద. సారాపోసి ఓట్లేయించుకున్న అంట్ల వెధవ. వాడో సర్పంచా? వట్టి దళారి వెధవ. నీ తమ్ముడు తోకాడిస్తూ తిరుగుతూంటాడు కదాని వాడి పక్షం మాట్లాడుతున్న దుర్మార్గపు వెధవ. వాడికేం తెలుసు తగూ తీర్చడం పింజారీ వెధవ!"

ఆయన చెప్పిందాంట్లో నిజంలేక పోలేదన్పించింది వెంకట్రావుకి. తనకి తనూ తన వ్యవసాయమూ తప్ప మరేమీ పట్టదు. తమ్ముడేమో సర్పంచ్ చుట్టూ తిరుగుతూంటాడు. అందుకనే అవాళలా తీర్పు చెప్పివుంటారు. ఎంత దారుణం!


"గోడ ఆరడుగుల్దే. కాదన్ను. కాని స్థలం పొడవెంత? ముప్పై ముప్పై ఐదు అడుగులుండదూ? వుంటుంది. అంటే ఆరడుగుల వెడల్పూ అన్ని అడుగుల పొడవూగల స్థలం నువ్వు నోర్మూసుక్కూర్చుంటే ఏమవుద్ది? నీ తమ్ముడి స్వంత మవుద్ది. ఇవాళ కాస్త స్థలమే కదాని నువ్వూరుకుంటే రేపు పశువుల కొట్టం దగ్గర వాటాకి రావొచ్చు. పొలం సరిహద్దుల్ని అతిక్రమించొచ్చు. వెర్రోడి పెళ్లాం వాడకెల్లా లోకువనీ మెత్తగా వుంటే మొట్టికాయలేస్తార్రా....."

"అవన్నీ విడిపోయేప్పుడు కాగితాల మీద రాసుకున్నాం కదండీ. మళ్ళీ వాటాకెలా వస్తాడు?"

"ఈ వుమ్మడిదారి గురించి రాసుకో లేదూ? అయినా ఆక్రమించుకోలేదూ? అంతేరా పిచ్చోడా. వూరుకుంటే నెత్తెక్కుతారు. వంగితే వీపెక్కి సవారీ చేస్తారు."

"నన్నేం చెయ్యమంటారో చెప్పండి. నాకేం తోచటంలేదు"

"అందుకేగా పిలిచిందీ. పదవివున్నా పూడినా నీలాటి వాడికి సాయం చెయ్యడమేరా నా పనీ. ఇదేమంత పెద్ద విషయం కాదులే. కోర్టులో చిన్న కాగితం పడేస్తే




చాలు కోర్టువారే గోడకూలగొట్టించి నీదారి నీకప్పగించేస్తారు"

"అలా చేస్తారంటారా...."

"ఎందుకు చెయ్యరూ అంతా కాగితాల్లో రాసుంటే"

"వూళ్ళో వాళ్ళు....."

"తమ్ముడిమీద వ్యాజ్యం వేసే పని ఏదో అనుకుంటారనుకుంటున్నావు కాబోలు. పిచ్చోడా - ఇప్పటికే నువ్వాలస్యం చేశావనుకుంటున్నారంతా. తెల్సిందా?"

తలాడించి, "ఆ కోర్టుపనేదో మీ చేతులమీదుగా కానివ్వండి" అన్నాడు.

"తప్పుతుందా. రేపో రెండ్రోందలు తీసుకుని పొద్దుటే రా ప్లీడర్ని కలుద్దాం"

అలాగే అన్చెప్పి వచ్చేశాడు. భోంచేస్తూ భూషయ్య చెప్పిందంతా భార్యకి చెప్పేడు వెంకట్రావు.

"ఎందుకొచ్చిన తద్దినంగాని ఆ గొడవల జోలికెళ్ళొద్దు. ఎవరి పాపాన వాళ్ళే పోతారు. కోరుటులంటూ తిరిగి కొంపా గోడూ అమ్ముకునే కన్నా ఆ కాస్తా మనది కాదనుకుంటేనే మేలు" అంది కామమ్మ.

"నేనూ ఆ మాటే అన్నానే. మనం నోర్మూసుక్కూర్చుంటే తమ్ముడు అన్నిటికీ అడ్డం పడొచ్చుంటున్నారాయన. గోడ వ్యవహారం చకాలికీ తేలిపోద్ది. అంతా కోర్టువారే చేస్తారు గనుక మన చేతికి మట్టి అంటదన్నారు."

"ఏమోనండీ. ఈ కోరుటులూ వకీళ్ళూ అంటే నాకెందుకో రాబందులు గుర్తొస్తాయి."

"నువ్వెక్కడో పూర్వకాలం దానివిగాని అన్నిటికీ భూషయ్యే వున్నాడే. మన వెనకె వరూ లేరని తనకి సర్పంచి అండవుందని విర్రవీగుతున్నాడే తమ్ముడూ. వాడికి బుద్ధి చెప్పకపోతే నాపేరు వెంకట్రావేగాదు"

మర్నాడు భూషయ్యతో కలిసి పట్నం వెళ్ళి ప్లీడర్ని కలిశాడు వెంకట్రావు.

పారీ కత్తులు చూసి, "న్యాయం నూరు శాతం మీ పక్షాన వుంది. రెండు వాయిదాల్లో తేలిపోవడం ఖాయం. దగ్గరుండి గోడపడగొట్టించే బాధ్యత నా భుజానవేసి మీరు నిశ్చింతగా నిద్రపోండి" అన్నాడాయన.

కోర్టుసమన్లు అందేసరికి నిప్పుతొక్కిన కోతిలా గంతులేశాడు చంద్రరావు. నానా శాపనార్థాలూ పెడుతూ తిట్టి పోసిం దతడి భార్య. వూళ్ళో వాళ్ళు చెవులు కొరుక్కున్నారు. అలాగని వెంకట్రావుని మందలించలేకపోయారు.

"ఇదంతా ఆ భూషయ్యగాడు పన్నిన పన్నాగం. మన తడాఖా చూపిద్దాం పద. మీ అన్నయ్యనీ ఆ భూషయ్యనీ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించకపోతే నేను నేనేకాదు" అంటూ రెచ్చిపోయాడు సర్పంచ్.

ఆయన కూడా వెళ్ళి మన ప్లీడర్ని ఆశ్రయించాడు చంద్రరావు.

తామే గెలుస్తామని చెప్పుకుంటూ ధీమాగా వున్నారిద్దరూ.

అన్నదమ్ములిద్దరూ ఒక పెళ్ళిలో తారసపడ్డారు. ఒకర్నొకరు శత్రువుల్లా చూసుకున్నారు. హుంకరిస్తూ చూసుకున్నారు. నీ పొగరణిగే రోజు రాబోతోందిలే అనుకున్నారు. ఒకరి నీడని కూడా భరించలేనట్టు ఎడమొఖం పెడమొఖంగా వుండిపోయారు.

వారిని చూసి చాలా బాధ పడ్డాడు ఇద్దరికీ కావాల్సిన ఒక ముసలాయన. అంతటితో ఆగలేదు. ఇద్దర్నీ పిలిచి పక్క పక్కన కూర్చోబెట్టుకుని హితబోధ చేశాడు.

"ఒరే అబ్బాయిలూ. భారతంలో అన్నదమ్ముల గొడవలు ఎంతదూరం తీసుకెళ్ళాయో మీకు తెలుసు. రామాయణంలో వాలిసుగ్రీవుల కథా మీకు తెలుసు. కలసి

వుంటేనే సుఖముందిరా పిచ్చివాళ్ళారా మనుషుల మధ్య గోడలు కట్టండిగాని మన సుల మధ్య గోడలు కట్టకండ్రా. యుగయుగాల సోదరత్వానికి సమాధికట్టకండి. సహజీవన సౌభాగ్యానికి నిప్పు పెట్టకండి. గోడవుందనుకుంటే వుంటుంది. లేదని కలిసిపోతే అడ్డేవుండదు. ఒకరికొకరు త్యాగం చెయ్యడంలో మహోన్నతి వుంది స్వార్థంతో కలబడితే వినాశనమే తప్ప వికాసం వుండదు. నా మాటవిని కోర్టు సంగతి మరిచిపోండి. ఎప్పట్లా పాలూ నీళ్ళలా కలిసిపోండి."

అంతా మౌనంగా విని లేచారు. పైపంచె ఝాడించి వెళ్ళిపోయారు చెరో వైపూ.

"వినాశకాలే విపరీత బుద్ధీ....." గొణుక్కున్నాడు ముసలాయన.

వెంకట్రావూ చంద్రరావూ కోర్టు చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. మధ్యలో కోర్టునియమించిన ప్లీడరొచ్చి గోడని చూసి వెళ్ళి తన రిపోర్టు సమర్పించాడు. ఇంకేముంది తీర్పువచ్చేస్తుంది ఇవాళో రేపో అని చెప్పేరు ఇద్దరి వకీళ్ళూ. కాని వాయిదాల మీద వాయిదాలు పడుతూనే వున్నాయి తప్ప కేసు అంతూ దరీ కన్పించడంలేదు!

ఇద్దరూ సన్నకారు రైతులే. వ్యాజ్యం నిమిత్తం అప్పుల పాలవ్వక తప్ప లేదిద్దరికీ.

నిజానికి ఇద్దరికీ కాళ్ళు లాక్కొచ్చాయని చెప్పాలి. అలాగని ఒక్కరిలోనూ వేడి తగ్గలేదు. ఇదంతా రెండోవారి వల్లే వచ్చిందన్న కోపంతో కక్షతో ద్వేషంతో మండిపోతున్నారిద్దరూ.

అటువంటి సమయంలో పొలంలో నీరు కట్టుబాటు దగ్గర గొడవ పడ్డారు ఇద్దరి పాలేర్లూ.

వెంకట్రావు పొలం దిగువునా చంద్రరావు పొలం ఎగువునా వున్నాయి. పద్ధతి ప్రకారం ముందు క్రింది పొలానికి నీళ్ళు పెట్టుకున్నాక పై పొలానికి నీళ్ళొదుల్తారు. కాని చంద్రరావు పాలేరు వెంకట్రావు పొలంలోకి నీరెళ్ళకుండా అడ్డుకట్టవేసి తమ పొలంలోకి నీరు పెట్టుకున్నాడు. అడ్డకట్ట తీసెయ్య బోయాడు వెంకట్రావు పాలేరు. పాలేర్లిద్దరూ ఘర్షణ పడుతోంటే మిగతా రైతులొచ్చి సర్ది చెప్పేరు. ఆనవాయితీ ప్రకారం వెంకట్రావు పొలానికే నీళ్ళిక్కనిచ్చారు.

కేసుమళ్ళీ వాయిదా పడటంతో విసుక్కుంటూ పట్నం నుంచి తిన్నగా పొలం వచ్చాడు వెంకట్రావు. జరిగిన గొడవంతా వివరించి చెప్పేడు పాలేరు.

తోకతొక్కిన త్రాచులా లేచాడు.

"ఇంక సహించేది లేదారేయ్. దీనికంతటికీ కారణం ఆ గోడే దాని సంగతీ వాడి సంగతీ ఇవాళ తేల్చి పారేస్తాను పదరా"

పాలేర్ని తీసుకువి పారా పలుగూ పట్టుకుని పెద్ద పెద్ద అంగల్తో వూళ్ళో కెళ్ళాడు వెంకట్రావు.

తిన్నగా గోడమీదికెళ్ళి పడ్డారిద్దరూ.


నాలుగు దెబ్బలకే ఫెళ ఫెళ మని గోడ కూలిపోయింది.

చంద్రరావు ఇంట్లోని ఆడవాళ్ళంతా లబోదిబోమన్నారు.

కామమ్మ ఏడుస్తూ భర్తని వారిస్తూ ప్రేక్షకురాలిగా వుండిపోయింది.

ఇరుగూ పొరుగూ మౌన సాక్షులయ్యారు.

వార్తతెలిసి చంద్రరావు తన పాలేర్తో కూలీల్తో పరుగు పరుగు నొచ్చాడు.



అన్నదమ్ములు కలబడ్డారు.

కళ్ళు నిప్పులు గ్రక్కాయ్.

ఆవేశాలు ఢీకొన్నాయ్.

పౌరుషాగ్నులు భగ్గుమన్నాయ్

అన్నగారి చేతిలోని గునపం తమ్ముడి గుండెల్లో దిగబడింది.

ఒక ఆర్తనాదం ఆ వూర్ని కుదిపేసింది.

మొదలు నరికిన మ్రానులా కూలిపోయాడు చంద్రరావు.

అతడి రక్తంతో తడిసి ముద్దయ్యింది మూడొంతులు కూలినగోడ.

కూలీలు పారి పోయారు.

శిలా విగ్రహమై చతికిల బడిపోయాడు వెంకట్రావు. సర్వం క్షణంలో కోల్పోయినట్టుగా వుందతడికి.

గుండెలు బాదుకున్నారు ఆడవాళ్ళు.

ఘోరకలి చూడలేక కర్మసాక్షి పడమటి కొండల్లో దాక్కున్నాడు.

పోలీసులొచ్చారు.

గ్రామపెద్దలూ వచ్చారు.

"ఆరడుగులనేలకోసం ఇంత ఘోరం చేస్తావా? నువ్వసలు మనిషివేనా?" వెంకట్రావుని ఈసడించారు సర్పంచీ మాజీ సర్పంచీకూడా

చంద్రరావు శవానికి అశ్రుతర్పణ చేశారు కూడా.

"ఒకే రక్తం పంచుకు పుట్టిన తమ్ముడని కూడా లేకుండా రక్తం కళ్ళ జూశాడు చూడు" ఎవరో అన్నారు మరెవర్తోనో.

"కలికాల మహిమమ్మా. బ్రహ్మంగారు చెప్పనే చెప్పేరు" ఒకావిడంది జనాంతికంగా.

"మనుషులూ మనసులే కాదు రక్తం కూడా శిథిలమైపోయింది. అంతా పాడు బడిపోయింది. బీడై పోయింది. వల్లకాడైపోయింది. నిన్న అయోధ్యలో ఇవాళ ఇక్కడ రేపు... దేశం ఏంకానుందో!" ముసలాయన గొణుగుడెవరూ పట్టించుకోలేదు.

ఏమీ వినబడని బధిరుళ్ళా చేష్టలు దక్కి పిచ్చిగా చూస్తూండిపోయాడు వెంకట్రావు.

పోస్టుమార్టం కార్యక్రమం పూర్తయ్యింది.

చంద్రరావుకి కొడుకుల్లేరు. అంచేత ఖనన కాండ వెంకట్రావే చెయ్యాల్సొచ్చింది. కష్టం మీద అనుమతిచ్చారు పోలీసులు.

కులాచార ప్రకారం ఆరడుగల పొడవూ మూడడుగుల వెడల్పూ గల గోతిలో తమ్ముడ్ని కప్పెట్టి బావురుమన్నాడు వెంకట్రావు.

రక్తమంటిన శిథిల గోడమాత్రం మానవతకి మాయని మచ్చలా అలా నిలబడే వుంది ఇప్పటికి ఆ వూళ్ళో!